అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం

- కాలనీల్లో రోడ్లపైనే నిలిచిన మురుగు
- పాదచారులకు తప్పని తిప్పలు
- ముసురు వర్షాలతో మరింత సమస్య
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు



ధరూరులోని కుర్వ వీధిలో రోడ్లపై పారుతున్న మురుగు



ధరూరులోని బీరప్ప గుడి వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని కాలనీలలో అంతర్గతరోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అంతర్గత రోడ్లను చూస్తే గ్రామీణ రోడ్లపై అధికారులకు ధ్యాసే లేనటుల కనిపిస్తోంది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. నివాస గృహాల వారు ఇళ్లలోంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు తిప్పలు తప్పేలా కనిపించడం లేదు.

అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి..

మండల కేంద్రంలోని కుర్వ వీధితో పాటు మండలంలోని కోతులగిద్ద గ్రామాల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. సీసీ రోడ్లకు ఇరువైపుల డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరంతా రోడ్లపై నిలుస్తోంది. దానికి తోడు వారం రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు సమస్య మరింత తీవ్రమైంది.

పెరిగిన దోమల బెడద..

ఇళ్ల ముందు నిలిచిన మురుగుపై దోమలు పెరిగిపోతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటిందంటే చాలు ఇంట్లో ఫ్యాను లేకుండా ఉండ లేకపోతున్నాం. ఫ్యాను వేసుకుంటే చలి, వేసుకోకపోతే దోమల బెడద ఉంటుంది. సర్పంచుల పదవీ కాలం ముగిసి నాటి నుంచి అధికారులు కనీసం దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు.

నడవ లేకడలేకపోతున్నాం..



మా కాలనీ అంతా మురుగుమయంగా మారింది. ఇంటి ముందు, ఇంటి వెనక అనే తేడా లేకుండా సీసీ రోడ్లపైనే మురుగు నిలిచింది. వారం రోజులుగా కురుస్తున్న ముసురుతో రోడ్ల న్నీ పాకరతో ఉన్నాయి. అడుగు పెడితే జారి పడే పరిస్థితి ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

– జయ్యన్న, ధరూరు

పట్టించుకునే నాథులే లేరు



ఊళ్లలో కాలనీ రోడ్లు ఎలా ఉన్నాయి. వాళ్లు ఎలా తిరుగుతారు అన్న ఆలోచన అధికారులకు కలగడం లేదు. పంచాయతీ సిబ్బందితో 15 రోజులకు ఒక సారి లేదా నెలకు ఒక్కసారైనా బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, నిలిచిన మురుగుకు కాలువలు ఏర్పాటు చేసి నిలవకుండా చూడాలన్న ఆలోచన అధికారులకు కలగడం లేదు.

– రామన్న, ధరూరు

చర్యలు తీసుకుంటాం..



ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ప్రజలు ఇళ్లలోంచి వచ్చే మురుగును ఇంకుడు గుంతలకు మళ్లించుకోవాలి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులకు తగు సూచలిస్తున్నాం. త్వరలోనే పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేయిస్తాం. రోడ్లపై మురుగు నిలువకుండా చర్యలు తీసుకుంటాం.

– మంజుల, ఎంపీడీఓ, ధరూరు

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం ఎక్లాస్పురం గ్రామానికి చెందిన కురువ పెద్ద నరసింహ వైద్య పరీక్షల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా రూ.60 వేలు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. వారితోపాటు నాయకులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



ధరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచితో పాటు సుచి, శుభ్రత పాటించి నాణ్యతగా వండాలని డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం ఆయన మండలంలోని పారుచర్ల ప్రాథమిక పాఠశాలలో భోజనం పరిశీలించారు. వారంలో మూడు రోజులు తప్పకుండా గుడ్డు అందించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ 100 శాతం ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, సీఆర్‌పీ పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల ద్వారా మరిన్ని సేవలు

గద్వాల: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఈ–మీ సేవ జిల్లా మేనేజర్ శివ ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యువేషన్ పత్రాలను మీ సేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని పొందవచ్చన్నారు. దీనికోసం ఆధార్, వయసు, ధ్రువీకరణ, ఇరువైపుల పెళ్లి పత్రికలు, తల్లిదండ్రుల వివరాలు, రెండు పెళ్లి ఫొటోలు, ముగ్గురు సాక్షుల సంతకాలు అవసరమన్నారు. గృహనిర్మాణాలు, వ్యవసాయేతర భూము లకు మార్కెట్ విలువను నిర్ధారించే వాల్యువేషన్ ధ్రువపత్రాలు గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తీసుకునేవారు, ప్రస్తుతం వాటిని మీ–సేవ కేంద్రాలలో కూడా పొందవచ్చని తెలిపారు. ఈ సేవలు ఈనెల 28వ తేదీ సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు



కేటీదొడ్డి: కరెంటు బిల్లు బకాయిలు చెల్లించాలని చెప్పినందుకు యజమాని విద్యుత్ లైన్‌మెన్‌ను బండ బూతులతో దూషించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన లైన్‌మెన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన కేటీదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఉమిత్యాల, మైలగడ్డ గ్రామాలకు జూనియర్ విద్యుత్ లైన్‌మెన్‌గా లక్ష్మణ్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఉమిత్యాల గ్రామానికి చెందిన కుర్వ వీరన్న కొంత కాలంగా కరెంట్ బిల్లు చెల్లించడం లేదు. ఆదివారం కుర్వ వీరన్నకు లైన్‌మెన్ ఫోన్ చేసి ఇంటి బిల్లు చెల్లించాలని, లేనిపక్షంలో కరెంటు కోత విధిస్తామని తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన వీరన్న విద్యుత్ లైన్‌మెన్‌ను ఇష్టాను సారంగా బండబూతులతో దూషించాడు. దీంతో మనస్థాపానికి గురైన లైన్‌మెన్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ వినియోగదారుడు బెదిరించినట్లుగా ఫిర్యాదు చేశాడు. కరెంటు బకాయిలు క్లియర్ చేయాలని కోరడంతో ఇంటి యజమాని ఇష్టానుసారంగా తిట్టి చంపుతానని బెదిరించినట్లు పేర్కొన్నాడు.తనను దూషించిన వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ట్రైయినీ ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరణ కోరగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మూడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

మానవపాడు: మండల కేంద్రంలో స్టేట్‌బ్యాంక్‌కు వెళ్లే దారిలో ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను ఏ ర్పాటు చేశామని ఏఈ సుబ్బారాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలు, పాతబడిన స్తంభాలను తొలగించామని పేర్కొన్నారు.

విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



కొండేరు పాఠశాలలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

ఎర్రవల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అమీర్‌పాష అన్నారు. సోమవారం మండలంలోని కొండేరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 5 నుంచి 14 సంవత్సరాల ఆధార్ లేని విద్యార్థులకు, బయోమెట్రిక్ అప్‌డేట్ కాని విద్యార్థులకు ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆధార్ ఏజెన్సీ వారు షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ఆధార్ సేవలు అందిస్తారన్నారు. ఇప్పటి వరకు ఆధార్ లేని వారికి కొత్త ఆధార్, బాల ఆధార్ ఉన్న వారికి బయోమెట్రిక్ అప్డేట్, కరెక్షన్స్ ఏమైనా ఉంటే వాటిని కూడా సరిచేయడం జరుగుతుందన్నారు. కొత్త ఆధార్ కోసం జనన ధ్రువపత్రం, పేరు కరెక్షన్ కోసం ఫొటో గల రెసిడెన్షియల్ ధ్రువపత్రం, జన్మదినం మార్పుకోసం జనన ధ్రువపత్రం, పేరు మార్పు కోసం గెజిట్ పత్రం వంటి వాటిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ధరూరు: ప్రతి విద్యార్థికి సంబంధించి అపార్ ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా, మెనూ ప్రకారం పెట్టేలా చూడాలని సూచించారు. విద్యార్థుల అపార్ కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పూర్తి స్థాయిలో అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, గౌరీశంకర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని కేటీదొడ్డి ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంతో పాటు రీసోర్స్ పర్సన్‌లు, సీఆర్‌పీలు యుగంధర్, పాపయ్య, శివరాజ్ పాల్గొన్నారు.

పభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రంగాపురం, మైలగడ్డ, రంగాపురం తండా ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వారి వెంట సీఆర్‌పీ యుగంధర్, పాపయ్య ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం, ఉత్తనూరు గ్రామంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ అతర్ జిల్లా బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలైన వారికి సోమవారం రాత్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ మోహన్‌రెడ్డి, అయిజ తహసీల్దార్ జ్యోతి హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు గౌతంరెడ్డి, రామచంద్రారెడి పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే విద్యార్థులకు ఆరోగ్యం



అలంపూర్‌లో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

అలంపూర్: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని మండలవైద్యాధికారి భరత్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని బీసీ హాస్టల్, ప్రభుత్వ జూనియర్ బాలుర హాస్టల్లో క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బీసీ హాస్టల్లో 120 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 22 మందికి అనారోగ్యంతో ఉండటంతో వారికి వైద్యం ఉచితంగా మందులు అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర హాస్టల్లో 22 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం హాస్టల్లోని విద్యార్థులకు అందించే భోజనాన్ని, వంట గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మాస్కులు ధరించడం, శుభ్రమైన నీటిని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శేఖర్, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ సురేఖ, బాలీశ్వరయ్య శెట్టి, ఆశా కార్యకర్తలు ప్రమీల, భారతి, వైద్య సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గద్వాల: అయిజ లయోలా స్కూల్‌కు చెందిన బస్సు బలిగెర గ్రామానికి చెందిన ముక్కరయ్యను ఢీకొట్టడంతో మృతి చెందారని, మృతికి కారణమైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవవడంతో పాటు, జిల్లా రవాణశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు కుర్వపల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

మల్దకల్: బడిబయట పిల్లలను బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు ఎస్ఐ కేశవరావు, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, లేబర్ అధికారి వేణుగోపాల్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు మల్దకల్‌లో బడిబయట ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చదువుకునే విద్యార్థులను బాలకార్మికులుగా మార్చి వారితో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మల్దకల్‌లోని పలు హోటళ్లు, వెల్డింగ్ షాపులతో పాటు సీడ్‌పత్తి పంట పొలాలను వారు తనిఖీ చేశారు. పంట పొలంలో ఉన్న బాలకార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం హోటళ్ల యజమానులకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవడం వల్ల ఎలాంటి చర్యలు ఉంటాయో వారికి వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్సీ విచారణకు వెళ్లిన రైతులు

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు నేపథ్యంలో చోటు చేసుకున్న ఘటనలపై సోమవారం హైదరాబాద్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దధన్వాడ, మాన్‌దొడ్డి, చిన్నధన్వాడ, ననసూరు గ్రామాల నుంచి రైతులు హైదరాబాద్‌కు వెళ్లారు. ఘటనలపై విచారణ చేస్తున్న క్రమంలో రైతులు అక్కడికి వెళ్లినట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ధర్మవరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఎర్రవల్లి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మండలంలోని ధర్మవరం బీసీ బాలుర వసతి గృహంలో ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని 125 మంది విద్యార్థులకు సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల గుర్తించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వంట, స్టోర్ గదులను ఆమె పరిశీలించి వంట సామగ్రిని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తాజా కూరగాయలు, ఆకుకూలతోనే నిత్యం వంట చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ రాములు, పీహెచ్ఎన్ సత్యం, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివుడికి పంచామృత అభిషేకం చేశారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

గట్టు: చెట్టుపై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని ఆరగిద్ద గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆరగిద్ద గ్రామానికి చెందిన వెంకటేష్(30) కూలి పనుల కోసం వెళ్లి చెట్టు కొమ్మలను కట్ చేస్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందాడు. అతనికి భార్యతో పాటుగా ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



రాజోళిలో నాగమ్మకు పాలు పోస్తున్న నూతన దంపతులు

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామా ల్లో సోమవారం నాగుల చవితి ఘనంగా నిర్వహించారు. ఉదయమే పుణ్యస్నానమాచరించి, ఇళ్ల ము ందు అలంకరించుకుని, దేవుడికి పూజలు చేశారు. అనంతరం ఆవు పాలు, కొబ్బరిగిన్నెలతో పాటు నైవేద్యం తీసుకుని నాగుల కట్ట వద్దకు వెళ్లి నాగమ్మకు పాలు పోశారు. ప్రత్యేకించి నూతన దంపతులు నాగమ్మకు పాలు పోయడం సంప్రదాయం. పచ్చర్ల, మాన్‌దొడ్డి, తుమ్మలపల్లె, తుమ్మిళ్ల తదితర గ్రామాల్లో పండుగ చేసుకున్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో నాగుల చవితి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టల్లో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఆలయం ముస్తాబు



అయిజ: గట్టుపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మప్ప స్వామి ఆలయం అయిజ మండలంలోని కిష్టాపురం, వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామాల మధ్య కొలువై ఉంది. శ్రావణ మాసం సందర్భంగా రెండు మండలాల భక్తులు స్వామివారి జాతర వైభవంగా నిర్వహిస్తారు. మంగళవారం జాతర నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు నిర్వాహకులు పూర్తి చేశారు.

తాటికుంటలో గుడి నిర్మాణానికి విరాళం



మల్దకల్: మండలంలోని తాటికుంట గ్రామంలో వెలసిన భద్రకాళీవీరభద్రస్వామి గుడినిర్మాణానికి సోమవారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కంసలి గౌరమ్మ, శ్రీనివాసాచారి దంపతులు రూ.51 వేలు విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో కంసలి హరికృష్ణ,ఆలయకమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహం ఊరేగింపు



అయిజ: మండల కేంద్రంలోని నరసింహ కాలనీలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసంను పురస్కరించుకొని సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన రోడ్లపై భాజా భజంత్రీలతో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సును సీజ్ చేసిన అధికారులు

అయిజ: మండల కేంద్రంలోని లయోలా స్కూల్‌కు చెందిన బస్సును సోమవారం రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. బస్సుకు ఫిట్నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ లేకపోవడంతో అధికారులు బస్సును సీజ్ చేసినట్లు ఆర్‌టీఓ వెంకటేశ్వర్ రావు తెలిపారు. అయిజ మండలానికి చెందిన లయోలా స్కూల్ బస్సు కారణంగా గట్టు మండలంలో బల్గెర గ్రామంలో జరిగిన యాక్సిడెంట్‌లో ఒక వ్యక్తి మృతి చెందడంతో రవాణాశాఖ అధికారులు స్కూల్ బస్సులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ రాములు, కానిస్టేబుల్ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

చేయూతనందించాలి

కేటీదొడ్డి: ప్రణాళిక బద్ధంగా చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రత్నసింహారెడ్డి అన్నారు. సోమవా రం మండలంలోని ఆలూర్ జిల్లా పరిషత్, గట్టు జిల్లా పరిషత్, గొర్లఖాన్ పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనంతమ్మ, వేమారెడ్డి జ్ఞాపకార్థం సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

వైభవంగా నాగదేవతల పునఃప్రతిష్టాపన

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మినర్సింహ స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం నాగదేవతల పున:ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి సంప్రోక్షణ చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నాగపంచామి సందర్భంగా మళ్లీ ఆలయం ప్రాంగణంలో నాగదేవతల విగ్రహాలను పున:ప్రతిష్ఠించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, కోశాధికారి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, మాజీ సర్పంచ్ రాజు, గ్రామస్తులు ఉజ్జెల్లి వెంకటయ్య, కుమ్మరి దేవేంద్రప్ప పాల్గొన్నారు.

మాంసాహారంతో అనారోగ్యం

వనపర్తి రూరల్: మాంసాహారంతో అనారోగ్యాలకు గురవుతారని పిరమిడ్ సొసైటీస్ పట్టణ అధ్యక్షుడు ఓమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాల గ్రామంలో పిరమిడ్ సొసైటీస్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. మాంసాహారం వల్ల కలిగే నష్టాలను వివరించారు. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, అస్తమా, క్యాన్సర్, గుండెపోటు, మోకాళ్ల నొప్పులకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ గుండం శైలజ, జైపాల్‌రెడ్డి, కమలమ్మ, ఉపేందర్‌రెడ్డి, వసంత, తిరుపతమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతోనే ప్రకృతి నాశనం



కోస్గి: మానవుని అనాలోచిత చర్యలతోనే ప్రకృతి నాశనం అవుతుందని యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త మల్లేశం అన్నారు. సోమవారం ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి ద్వారా.. ప్రకృతి సంరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవరాశుల మనుగడకు అవసరమయ్యే గాలి, నీరు, ఆహారం ప్రకృతి ద్వారానే లభిస్తాయన్నారు. ఆధునీకరణ, పారిశ్రామీకరణ, నగరీకరణ, కార్పొరేటీకరణ ప్రకృతి స్వచ్ఛతను పాడు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖలు పోటీలు నిర్వహించి ప్రకృతి పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎర్త్ క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.